# వినోద, సమాచార సమ్మిశ్రమం- పర్యాటకం!

**(World tourismday - september 27th)**



"విదేశీయులకు మాత్రమే పరిమితం" పర్యాటక రంగానికి ఈ మాట ఒకప్పుడు పర్యాయపదం.
కానీ భారతదేశంలో మారుతున్న జీవనశైలి పర్యాటకరంగం తీరుతెన్నులను మార్చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పుడు పర్యాటక రంగం కూడా ప్రధాన ఆదాయ వనరుగా మారుతోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం (సెప్టెంబర్ 27) సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసం సమర్పిస్తున్నాం.

పుణ్య క్షేత్రాల సందర్శన అనేది ఒకప్పుడు రాష్ట్రంలో ప్రజలకు భక్తిని- రక్తిని, వినోదాన్ని- విజ్ఞానాన్ని పంచే యాత్రగా ఉండేది. తీర్థ యాత్ర అంటే కుటుంబ సభ్యులందరికీ ఎంతో ఉత్సాహంగా ఉండేది. ఏ వయసువారి ఆలోచన వారిది. కొత్త ప్రదేశానికి వెడుతున్నామన్నది పిల్లల ఉత్సాహమైతే, భగవద్దర్శనానికి వెడుతున్నామన్న ఆనందం వృద్ధులది. తిరుమల, శ్రీశైలం, భద్రాచలం వంటి ప్రదేశాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలుగా భాసిల్లగలుగుతున్నాయంటే దానికి కారణం కేవలం భగవద్భక్తి ఒక్కటే కాదు. పచ్చని ప్రకృతితో కళకళలాడే పరిసరాలు కూడా కొంత వరకూ కారణం.



ఈ రెండూ ఒకదానికి ఒకటి తోడైనాయి. ఆధ్యాత్మికతో పాటు ఆహ్లాదాన్ని అందిచాయి. ఇప్పటికీ ఈ కారణాన్ని కొట్టిపారేయలేని స్థితి ఉంది.

ఆంధ్రప్రదేశ్ ప్రజల, అసలు ఆ మాటకు వస్తే భారతదేశ ప్రజల మీద గ్లోబలైజేషన్, కంప్యూటరైజేషన్ ప్రభావం పడినప్పటి నుంచీ జీవన స్థితిగతులు మారిపోయాయి. ప్రజల ఆదాయం పెరిగింది. ఎప్పుడైతే ఆదాయం పెరగడం ప్రారంభమయ్యిందో అప్పుడే దానికి అనుబంధంగా పర్యాటక రంగం అభివృద్ధి చెందడం ఆరంభించింది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని పర్యాటక శాఖ. 1990లో నామమాత్రంగా ఉండే ఈ శాఖకు ఇప్పుడు 200కు పైగా సొంత బస్సులున్నాయి. అంటే రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతున్నదన్నమాటే. దీనికి కారణం. కొంతవరకూ ప్రవాస భారతీయులైతే, కొంతవరకూ రాష్ట్రంలోని ప్రజలు. క్రమంగా ఆదాయం పెరుగుతున్న శాఖగా గుర్తింపు పొందుతున్న పర్యాటకశాఖ, పర్యాటకులకు ఎన్నో వసతులు, సౌకర్యాలు సమకూరుస్తోంది. మారుమూలలకూ తన కార్యకలాపాలు విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఆధ్యాత్మిక క్షేత్రాలకే కాకుండా పర్యాటక కేంద్రాలకూ ప్రాముఖ్యం పెరిగింది. రాష్ట్రంలో చూడదగిన కేంద్రాలలో ముఖ్యమైన, మనకు తెలియని కేంద్రాలను తెలుసుకుందాం!

పుణ్య క్షేత్రాలు కాకుండా రాష్ట్రంలో చూడదగిన ప్రదేశాలు అభయారణ్యాలు, ప్రాచీన ప్రాముఖ్యం ఉన్న ప్రదేశాలు. నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌వంటివి అభయారణ్యాల పరిధిలో ఉన్నాయి. ఇవి చూడదగినవే అయితే, శాలిహుండం, గుంటుపల్లి, ఉండవల్లి, కొలనుపాక, అమరావతి, జగ్గయ్యపేట వంటి బౌద్ధక్షేత్రాలు విజ్ఞానాన్ని పెంపొందించే ప్రదేశాలు. ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధ, జైన మతాల ప్రభావం ఎలా ఉండేదో నేడు తెలుసుకోవడానికి వీలు కల్పించే ప్రత్యక్షసాక్ష్యాలు ఈ ప్రదేశాలు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా చూడదగినవివి.

ప్రాచీన నాగరికతలన్నీ నదీ కేంద్రాల పరిసరాలలో పరిఢవిల్లినట్టే ఒకప్పుడీ ప్రదేశాలూ జనావాసాలుగా, విద్యాలయాలుగా వెలుగొందాయి. ఈ వెలుగు నేడు కొడిగట్టినా, ఆ అవశేషాలు మనముందున్నాయి. ఎల్లోరాను చూసినప్పుడు కలిగే అనుభూతే మనకు ఉండవల్లిని చూసినా కలుగుతుంది. పరిసరాలు, నిర్మాణ విశేషాలలోని పోలిక ఒక్కటే కాదు, మనల్ని ఆ కాలంలోకి తీసుకువెళ్ళగలిగిన శక్తి ఈనాటికీ ఈ ప్రదేశాలకు ఉండడం దానికి అసలు కారణం.

రాష్ట్రంలో పర్యాటక రంగమనేది వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందనుకోకండి. మన ప్రాచీన సంస్కృతిని తిరిగి మన కళ్ళముందు ఆవిష్కృతం చేయగలిగిన శాఖ అది. చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవాలంటే పఠనాభిరుచే కాదు
పర్యటనాసక్తి కూడా కావాలి.